సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 21 । సెప్టెంబర్ । 2023



100 పడకలు వేగంగా పూర్తవ్వాలి

చింతలపూడిలో 100 పడకల ఆసుపత్రి పనులు ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆస్పత్రి పనులు తనిఖీ చేశారు. IIలో ▸



వరిలో ఎలుకల బెడద

సార్వా సీజన్‌లో ఆకుమడి దశ నుంచి కుప్పల వరకు రైతులకు ఎలుకల బెడద తప్పడం లేదు. దీంతో రైతులు అధికంగా నష్టపోతున్నారు. IIలో ▸

గౌరీ తనయా.. నమోనమః

ఊరూవాడా చవితి వేడుకలు అట్టహాసంగా జరుగుతున్నాయి. బుధవారం పలు ప్రాంతాల్లో గణపతి నిమజ్జనాలు ఉత్సాహంగా జరిగాయి.



IIలో

న్యూస్‌రీల్

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న డీవైఈఓ శ్రీరామ్

సాక్షి, భీమవరం: విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని డీవైఈఓ శ్రీరామ్ తెలిపారు. పట్టణంలోని శ్రీచింతలపాటి బాపిరాజు స్మారక హైస్కూల్లో బుధవారం నిర్వహించిన 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ ఒకరోజు శిక్షణలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు చక్కటి విద్యాబోధనతో విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. 'ఆరోగ్యం, సంక్షేమం కోసం పర్యావరణ వ్యవస్థను అర్థం చేసుకోవడం' అనే అంశంపై ఉపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్స్ ఎం.భాస్కరరావు, జి.సుకుమార్, టి.సతీష్‌కుమార్ శిక్షణ ఇచ్చారు.

నేషనల్ స్కాలర్‌షిప్‌నకు గడువు పెంపు

సాక్షి, భీమవరం: 2023 విద్యా సంవత్సరములో జరగనున్న నేషనల్ మీన్స్–కం–మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష నమోదు గడువును ఈనెల 25 వరకూ పొడిగించారని డీఈఓ ఆర్‌వీ రమణ తెలిపారు. డిసెంబర్ 3న జరగనున్న పరీక్షకు విద్యార్థులంతా సకాలంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 8వ తరగతి చదివే విద్యార్థి కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3,50,000లోపు ఉన్నవారు అర్హులన్నారు. తాజా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రం లేని విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డిసెంబర్ 3న పరీక్ష జరిగే రోజుకు ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు సంబంధిత వెబ్‌సైట్ లేదా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

పోలీస్ సర్కిల్ కార్యాలయం ప్రారంభోత్సవానికి చర్యలు



చింతలపూడిలో పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ

చింతలపూడి: చింతలపూడి పట్టణంలో నూతనంగా నిర్మించిన పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవి భాస్కరరావు బుధవారం సందర్శించారు. నరసాపురం మండలంలో జరిగిన జిల్లా స్పందన కార్యక్రమానికి వెళ్లి వస్తూ సీఐ కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజీ నుంచి ఆదేశాలు రాగానే కార్యాలయాన్ని ప్రారంభిస్తామని చెప్పారు. కార్యాలయ భవనం నిర్మాణంలో శ్రద్ధ వహించిన సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావును ఆయన అభినందించారు.

ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో 12న పుణ్యక్షేత్ర యాత్ర

ఏలూరు (టూటౌన్): ఐఆర్‌సీటీసీ భారతీయ రైల్వే అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో పూరి–కాశీ–అయోధ్య పుణ్యక్షేత్ర యాత్ర కోసం భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు వచ్చే నెల 12 నుంచి సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరుతుందని ఏరియా మేనేజర్ వీవై ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాత్ర 9 రాత్రులు, 10 పగళ్లు సాగుతుందని తెలిపారు. పూరి, కోణార్క్, గయా, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్ క్షేత్రాలు సందర్శిస్తుందన్నారు. సికింద్రాబాద్, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట స్టేషన్లలో రైలు ఆగుతుందన్నారు. స్లీపర్ క్లాస్‌కు రూ.16,400, థర్డ్ ఏసీ టిక్కెట్‌కు రూ.25,500, సెకంట్ ఏసీ టిక్కెట్ ధర రూ.33,300గా నిర్ణయించామన్నారు. టిక్కెట్ల కోసం ఐఆర్‌సీటీసీ విజయవాడలో తీసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఐఆర్‌సీటీసీ సిబ్బంది బాలాజీ 82879 32312, ప్రవీణ్ 92814 95848 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా రాజేంద్రప్రసాద్

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ జి.రాజేంద్రప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కళాశాలలో ప్రొఫెసర్ ఆఫ్ పీడియాట్రిక్ సర్జన్‌గా పనిచేస్తున్న రాజేంద్రప్రసాద్ తాత్కాలికంగా అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా పదోన్నతి పొందారు. ఆయన ఏలూరు జీజీహెచ్‌కు పదోన్నతిపై వచ్చారు. ప్రస్తుతం ఏలూరు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ శశిధర్‌ను బదిలీ చేశారు.

పరుగు పరీక్షలో తడబాటు

- ఎస్సై దేహదారుఢ్య పరీక్షల్లో ఫిట్
- పరుగులో మాత్రం వెనుకంజ
- అర్హత కోల్పోయిన 1,577 మంది
- పకడ్బందీగా ఎస్సై పోస్టుల రిక్రూట్‌మెంట్



1600 మీటర్ల పరుగులో పాల్గొన్న అభ్యర్థులు

మొత్తం అభ్యర్థులు	పురుషులు	స్త్రీలు
9,690	8,248	1,442
హాజరైన అభ్యర్థులు	పురుషులు	స్త్రీలు
7,877	6,694	1,181
అర్హత పొందిన వారు	పురుషులు	స్త్రీలు
5,410	4,796	614

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పరుగు పరీక్షలో యువత తడబడుతున్నారు. నెలల తరబడి ఫిట్‌నెస్ శిక్షణ పొంది ఏళ్లుగా ఎదురుచూసిన డ్రీమ్ జాబ్‌ను పరుగు పందెం తడబాటుతో పోగొట్టుకుంటున్నారు. ఎస్సై ఉద్యోగం కోసం 1600 మీటర్ల పరుగును 8 నిమిషాల్లో పూర్తి చేయడానికి సమగ్ర శిక్షణ ఉన్నప్పటికీ అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల ఏలూరులో ఎస్సై రిక్రూట్‌మెంట్ పోటీల్లో కనిపించిన పరిస్థితి ఇది. ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 1,577 మంది పరుగు పందెంలో అర్హత సాధించలేక అనర్హులుగా మారారు. దీంతో మళ్ళీ రిక్రూట్‌మెంట్ కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి.

ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షల్లో అనేక మినహాయింపులు

ఏలూరు రేంజ్ పరిధిలో ఎస్సై సెలెక్షన్స్ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ సజావుగా ముగిసింది. పకడ్బందీగా ఈవెంట్స్ నిర్వహించడంతో పాటు గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అభ్యర్థులకు ఎక్కువ అవకాశం ఇచ్చారు. గత నెల 25 నుంచి ఈ నెల 15 వరకు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాలకు సంబంధించిన అభ్యర్థులకు పోటీలు నిర్వహించారు. మొత్తం 9,690 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 7,877 మంది హాజరయ్యారు. వీరిలో 5,410 మంది మాత్రమే అర్హత సాధించారు. ఈ పర్యాయం రిక్రూట్‌మెంట్ పరిధిలో అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం అనేక సడలింపులు ఇచ్చింది. ఈ సారి షెడ్యూల్ తేదీలతో సంబంధం లేకుండా రిక్రూట్ సమయంలో ఎప్పుడు వచ్చినా పరీక్షలు నిర్వహించే వెసులుబాటు ఇచ్చారు. మహిళా అభ్యర్థులకు ఒకరోజు మాత్రమే నిర్వహించాల్సిన పోటీలు వారి సౌకర్యం కోసం రెండు రోజుల పాటు నిర్వహించారు. వీటన్నింటితో పాటు పరేడ్ గ్రౌండ్‌లో ప్రత్యేకంగా వైద్య శిబిరాలు 21 రోజులు పాటు నిర్వహించి డాక్టర్, నర్సులతో పాటు పూర్తి స్థాయిలో అవసరమైన మందులు, ప్రథమ చికిత్స కిట్లు ఏర్పాటు చేశారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను పెద్ద ఎత్తున అందుబాటులో ఉంచారు. ఈవెంట్‌కు గతంలో సమయం లేకుండా వెంటవెంటనే నిర్వహించే పరిస్థితి. ఈసారి ప్రతి దానికి అభ్యర్థులు అలసట తీరి మళ్ళీ సన్నద్ధం కావడానికి వీలుగా గంట సమయం ఇచ్చారు. రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి అభ్యర్థుల నుంచి వచ్చిన అప్పీళ్లను స్వీకరించి మళ్ళీ కొంత మందికి ఇంకో చాన్స్ ఇచ్చారు.

1600 మీటర్ల పరుగులో విఫలం

1600 మీటర్ల పరుగుపందెంకు పురుష అభ్యర్థులకు 8 నిమిషాలు, మహిళా అభ్యర్థులకు 10 నిమిషాల సమయం ఇచ్చారు. మొత్తం 1,577 మంది అర్హత పొందలేకపోయారు. వీరిలో 1,152 మంది పురుషులుండగా 425 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. ఫిజికల్ మెజర్మెంట్ టెస్ట్(పీఎంటీ), హైట్, చెస్ట్ పరీక్షలకు 444 మంది అర్హత పొందలేకపోయారు. వీరిలో 413 మంది పురుషులు, 31 మంది మహిళా అభ్యర్థులున్నారు. 100 మీటర్లు, లాంగ్‌జంప్‌లో 405 మంది అనర్హులు కాగా వీరిలో 292 మంది పురుషులు, 113 మంది మహిళా అభ్యర్థులున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు

అభ్యర్థులకు సమయం వృథా కాకుండా, ఈవెంట్స్‌కు ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా టీంలు ఏర్పాటు చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఒక టీం, ఎత్తు, చాతీ పరీక్షలు నిర్వహించడానికి ఒక టీమ్, ఈవెంట్స్‌కు ఇంకో టీమ్ ఇలా ప్రతి దశలో పెద్ద ఎత్తున శాఖాపరమైన సిబ్బందిని వినియోగించి రోజుకు సగటున 800 మందికి అన్ని పరీక్షలు పూర్తి చేశారు. గత నెల 25 నుంచి ఈ నెల 15వ తేది వరకు జరిగిన సెలెక్షన్స్‌లో వర్షాల కారణంగా ఆరు రోజుల పాటు ఈవెంట్లు నిర్వహించలేదు. ఎంపికైన 5410 మంది అభ్యర్థుల్లో 4796 మంది పురుషులు, 614 మంది మహిళా అభ్యర్థులకు వచ్చే నెల 14,15 తేదిల్లో రాతపరీక్షలు నిర్వహించి దాని ఆధారంగా ఎంపిక చేయనున్నారు.

వచ్చే నెలలో రాత పరీక్షలు



వచ్చే నెల 14, 15 తేదీల్లో ఏలూరు రేంజ్ పరిధిలో 5,410 మంది అభ్యర్థులకు రాత పరీక్షలు నిర్వహిస్తున్నాం. 4,796 మంది పురుష అభ్యర్థులు, 614 మంది మహిళా అభ్యర్థులు ఎంపికయ్యారు. వీరందరికీ హాల్‌టిక్కెట్‌లు పంపి రాతపరీక్షలు నిర్వహిస్తాం. 1600 మీటర్లు, ఈవెంట్స్‌లో ఎక్కువ మంది అభ్యర్థులు అర్హత సాధించలేకపోయారు.

– జీవీజీ అశోక్‌కుమార్, ఏలూరు రేంజ్ డీఐజీ

ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి
ఆరోగ్య సురక్ష



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరు పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం స్థానిక పురపాలక సంఘం పరిధి బలుసుమూడి బీసీ కాలనీలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేలో పాల్గొని ప్రజలతో కలెక్టరు మాట్లాడారు. రోగ నిర్ధారణ ఆధారంగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో వైద్య సూచనలు, వైద్య సేవలు పొందాలని వివరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ప్రతి గడపకు ఆరోగ్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వ శ్రీకారం చుట్టిందని అన్నారు. ఇంటింటికీ ఆరోగ్య సిబ్బంది వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటారని, అక్కడే కావాల్సిన పరీక్షలు చేస్తారన్నారు. ఆ తర్వాత ప్రత్యేకంగా హెల్త్ క్యాంపులు పెట్టి అవసరమైన వారికి కళ్లజోళ్లు, వినికిడి యంత్రాలు, తదితర పనిముట్లు, మందులు అందిస్తారన్నారు. ఇప్పటి వరకు గుర్తించని సమస్యలు ఉంటే గుర్తించి, వారికి చెప్పి ఆస్పత్రులకు రిఫర్ చేస్తారని వెంటనే కొన్ని మందులు ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో దాసి రాజు, వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.డి.మహేశ్వర రావు, పురపాలక సంఘం కమిషనరు ఎస్.శ్యామల, ఇన్‌చార్జ్ తహసీల్దారు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లు అందుబాటులో ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): పోలింగ్ స్టేషన్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా రేషనలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నియోజకవర్గ ఈఆర్వోలను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డితో కలిసి తాడేపల్లిగూడెం, ఉండి, నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గ ఈఆర్వోలతో సమావేశమై పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రెండు కిలోమీటర్ల పరిధిలో పోలింగ్ స్టేషన్‌ను కచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. చేర్పులు, మార్పులు, కొత్త పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించడంతోపాటు, స్థానిక ప్రజల విజ్ఞాపనలను కూడా పరిగణలోనికి తీసుకోవాలన్నారు. ఓటర్ల జాబితా ప్రకారం 1,500 జనాభా దాటితే అదనపు పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఒక వీధిలోని వారు, ఒక కుటుంబం, ఒక అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న ఓటర్లు అందరూ ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కు వినియోగించుకునేలా రేషనలైజేషన్ ప్రక్రియలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పోలింగ్ స్టేషన్లలో వసతుల పరిశీలన

భీమవరం పురపాలక సంఘం పరిధి, రూరల్ గ్రామాలలో ప్రకాష్ నగర్, గునుపూడి, శ్రీరామపురం, రాయలం, వెంప, దురుసుమర్రు పోలింగు స్టేషన్లను జిల్లా కలెక్టరు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలింగ్ స్టేషన్లలో మౌలిక వసతుల్ని కలెక్టరు కుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎన్నికల ఘట్టంలో పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ అత్యంత ముఖ్యమన్నారు. ఒకటికి రెండు సార్లు, అవసరమైతే మూడోసారి పరిశీలించిన అనంతరమే పోలింగ్ స్టేషన్ల మార్పులు, చేర్పులు, కొత్త వాటి ఏర్పాటుపై కచ్చితమైన నివేదికలు సమర్పించాలన్నారు. అన్ని పూర్తయిన తరువాత నియోజకవర్గాల వారీగా ఈఆర్వోలు సమర్పించిన నివేదికలను ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయానికి సమర్పిస్తారన్నారు. కొత్త పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలంటే 1,500 ఓటర్లు ఉండాలని, ఈపీ రేషియోను పరిశీలించి కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టరు ఆదేశించారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం



పెనుగొండలో సచివాలయం-4 భవన సముదాయాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో ప్రజలకు అందించారని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పెనుగొండ సచివాలయం 4లో రూ.కోటి తో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్‌లను బుధవారం ప్రారంభించారు. ప్రజల ఇంటి వద్దకే పాలన అందించాలన్న లక్ష్యంతో దేశంలో ఎక్కడాలేని విధంగా వినూత్న మార్పును సీఎం జగన్ తీసుకువచ్చారన్నారు. పెనుగొండలో గతంలో లేని విధంగా అభివృద్ధి చేశామన్నారు. రూ.1.25 కోట్లతో కోడి పందేల దిబ్బ, రూ.కోటితో నగరేశ్వర స్వామి కాలనీ అభివృద్ధితో పాటు, రూ.4 కోట్లతో పెనుగొండలోని పాఠశాలలు అభివృద్ధి చేశామన్నారు. రూ.4 కోట్లతో పెనుగొండ మార్టేరు రహదారి నాణ్యంగా నిర్మించామని చెప్పారు. రూ.17 కోట్లతో పెనుగొండ ములపర్రు, ఆచంట సిద్ధాంతం రహదారి విస్తరణ చేపట్టామన్నారు. పెనుగొండలోనే ఐదుకుపైగా కమ్యూనిటీ భవన నిర్మాణాలకు శ్రీకారం చుట్టామన్నారు. రూ.2 కోట్లతో గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో రహదారులు, డ్రయినేజీల నిర్మాణం చేపట్టామన్నారు. నాడు-నేడుతో ప్రభుత్వ విద్యలో వినూత్న మార్పులు వచ్చాయని శ్రీరంగనాథరాజు అన్నారు. పెనుగొండలో బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సీసీ కెమెరా నిఘా వ్యవస్థను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ పుతినీడి వెంకటేశ్వరావు, సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ, ఎంపీటీసీలు తాడి సుబ్బిరెడ్డి, మండల కన్వీనరు బాబిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, ఎస్సీ సెల్ మండల కన్వీనరు పలివెల శ్రీను, విద్యామౌలిక వసతుల కార్పొరేషన్ డైరక్టరు కొవ్వూరి వేణుమాధవ రెడ్డి, పార్టీ నాయకులు పోడూరి రామయ్య, గాజుల బులి పుల్లారావు, మేడపాటి చిరంజీవి రెడ్డి, వేండ్ర లీలా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార మాసోత్సవాలు



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా భీమవరం అర్బన్ పరిధిలోని స్థానిక అంబేద్కర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీ, బాలింతలకు పోషకాహార అవగాహనా సదస్సు నిర్వహించారు. ప్రాజెక్టు డైరక్టర్ బి.సుజాత రాణి మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు, వంట చేసుకొనే విధానం గురించి తెలుసుకొని మెరుగైన ఆహారపు అలవాట్ల గురించి అవగాహన కల్పించారు. రెండు సంవత్సరాలలోపు పిల్లలకు అనుసరించాల్సిన ఆహార విధానాలతో పాటు ముర్రుపాలు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఆహార పంపిణీ కేంద్రాలుగా మాత్రమే కాకుండా నాలెడ్జ్ షేరింగ్ సెంటర్లుగా తయారు కావాలని ఆదేశించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరక్టర్ బి.సుజాత రాణి, నోడల్ ఆఫీసర్ విజయలక్ష్మి, సూపర్ వైజర్ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లుపై హర్షాతిరేకాలు

- బిల్లుకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతుపై ప్రశంసలు
- రాష్ట్రంలో మహిళా సాధికారతకు పట్టం కట్టిన ప్రభుత్వం
- స్థానిక సంస్థల పదవుల్లో, సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం



భీమవరం(ప్రకాశం చౌక్): చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించే మహిళా బిల్లుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ఈ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందితే దేశంలో మహిళా సాధికారత సాధ్యమవుతుందని అంటున్నారు. ఇప్పటికే ఈ బిల్లు వైఎస్సార్‌సీపీ పార్టీ మద్దతు తెలపడాన్ని ప్రశంసిస్తున్నారు. రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో మహిళలకు పెద్ద పీట వేశారు. వారికి దేశంలో ఎక్కడా లేని విధంగా రాజకీయ పదవుల్లో 50 శాతం పైగా పదవులు కేటాయించారు. సంక్షేమ పథకాల్లో 90 శాతంపైనే మహిళలే లబ్ధిదారులుగా ఉన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేశారు.

మహిళా బిల్లుకు మద్దతు పట్ల హర్షం

మహిళా బిల్లుకు మద్దతు ఇచ్చి లోక్‌సభలో ప్రవేశపెట్టడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాజకీయంగా మహిళలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సహించి పదవుల్లో ప్రాధన్యత కల్పించారు. ఇంటి స్థలం దగ్గర నుంచి రేషన్ కార్డు వరకు మహిళలకు అందించి వారిని ఇంటి యాజమానిగా చేశారని ప్రశంసిస్తున్నారు. జిల్లాలో మొత్తం 409 పంచాయతీలకు 393 పంచాయతీలకు ఎన్నికలు జరగ్గా 147 మంది మహిళ సర్పంచ్‌లు ఎన్నికయ్యారు. 897 ఎంపీటీలకు 448 మంది మహిళా ఎంపీటీసీలు ఉన్నారు. 20 జెడ్పీటీసీలకు 10 మంది మహిళలు ఉన్నారు.

సంక్షేమ పథకాల్లో 90 శాతం మహిళలే లబ్ధిదారులుగా ముందంజలో ఉన్నారు. అమ్మ ఒడిలో 4.32 లక్షల మంది మహిళలు, చేయూతలో 2.79 లక్షలు, డ్వాక్రా రుణమాఫీలో 2.4 లక్షల మంది, కాపు నేస్తంలో 35,358 మంది, జగనన్న ఇళ్ల పథకంలో 70,938 మంది, కళ్యాణమస్తులో 1476 మంది మహిళలు లబ్ధి పొందారు.

ఆ ఘనత సీఎం జగనన్నదే



మహిళా బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టడం శుభపరిమాణం. బిల్లుకు మద్దతు ఇచ్చి మహిళలను గౌరవించిన ప్రభుత్వంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రశంసలు అందుకుంటుంది. ముఖ్యమంత్రి మహిళ పక్షపాతిగా అన్నింటా మహిళలకే ప్రాధాన్యత కల్పించారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్ ప్రకారం అన్నింటా ఆయన మహిళలకు సామాజిక న్యాయం చేస్తున్నారు.

– ఘంటా పద్మశ్రీ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్

మహిళా సాధికారతకు పట్టం



మహిళా బిల్లు లోక్‌సభలో ప్రవేశపెట్టడం సంతోషదాయకం. బిల్లుకు ప్రభుత్వం మద్దతు ఇచ్చి సహకారం అందించడం హర్షణీయం. ఇప్పటికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి పదవులు కేటాయించారు. మహిళను హోం మంత్రి చేసిన ఘనత నాడు వైఎస్సార్‌కు దక్కితే రెండు అడుగులు ముందుకు వేసి ఇద్దరు మహిళలను హోం మంత్రులు చేసిన ఘనత జగనన్నకే దక్కింది.

– గూడూరి ఉమాబాల, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు

మహిళా బిల్లు ప్రవేశపెట్టడం సంతోషం



మహిళా బిల్లును కేబినెట్ ఆమోదించి లోక్‌సభలో ప్రవేశపెట్టడం సంతోషదాయకం. 33 శాతం రిజర్వేషన్ అమలు జరిగితే ఎక్కువ మంది మహిళలకు చట్టసభలో స్థానం లభిస్తుంది. దాంతో మహిళా సాధికారత సాధించగలుగుతారు. మహిళల సమస్యల పరిష్కారం సులభం అవుతుంది. మహిళా బిల్లుకు మద్దతు తెలిపిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– మాదిరెడ్డి స్వరాజ్యలక్ష్మి, వైద్యురాలు, భీమవరం

పార్టీని మరింత బలోపేతం చేయాలి



ఎమ్మెల్యే ఆళ్ళ నానిని మర్యాదపూర్వకంగా కలిసిన జేసీఎస్ కోఆర్డినేటర్లు అనిల్, శివ

ఏలూరు టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకువెళ్లేందుకు జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్లు కృషి చేయాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నాని చెప్పారు. జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్లుగా చింతలపూడి నియోజకవర్గ జంగారెడ్డిగూడెంకు చెందిన చింత అనిల్ కుమార్, ఏలూరుకు చెందిన వైఎన్‌వీ శివరావు నియమితులయ్యారు. ఏలూరు శ్రీరామ్ నగర్ లోని క్యాంపు కార్యాలయంలో ఆళ్ల నానిని వారు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఆళ్ల నాని మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందిస్తూ మరోవైపు రాష్ట్ర అభివృద్ధికి శ్రమిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరు అండగా ఉండేలా ప్రజలను చైతన్యవంతులను చేయాలని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు.

క్లుప్తంగా

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



మహిళలకు కుట్టు మెషీన్లు, ప్రశంసా ప్రతాలను అందజేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పాలకొల్లు అర్బన్: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ముందుకు సాగాలని కలెక్టర్ పి.ప్రశాంతి కోరారు. శివదేవునిచిక్కాలలో శ్రీరాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ పొందిన 30 మంది మహిళలకు కలెక్టర్ ప్రశాంతిబుధవారం రాత్రి కుట్టు మెషీన్లు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి ఉచితంగా మిషన్లు అందజేయడం అభినందనీయమన్నారు. రెండో బ్యాచ్ శిక్షణ కూడా కలెక్టర్ ప్రారంభించారు. ట్రస్ట్ వ్యవస్థాపకుడు నిమ్మల అనంత రామారావు, సభ్యులు నిమ్మల వెంకట సత్యనారాయణ, సర్పంచ్ దిడ్ల మణివజ్రం, సొసైటీ త్రిసభ్య కమిటీ అధ్యక్షుడు ర్యాలి శివ రామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ హుండీ ఆదాయం రూ.12 లక్షలు



హుండీని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

మొగల్తూరు : ముత్యాలపల్లిలో వేంచేసియున్న శ్రీ బండి ముత్యాలమ్మ ఆలయ హుండీని బుధవారం లెక్కించగా 54 రోజుల కాలానికి రూ.12,94,037 ఆదాయం లభించినట్లు ఈవో డి.రామకృష్ణంరాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్లు, గ్రామ పెద్దలు, ఆలయ పాలకవర్గ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్ది ధర్మకర్తల మండలి నియామకానికి నోటిఫికేషన్

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలోని శ్రీ మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి నియామకానికి దేవదాయ శాఖ ఉప కమిషనర్ కాకినాడ కార్యాలయం నుంచి నోటిఫికేషన్ ఇచ్చినట్లు ఈవో ఆకుల కొండలరావు బుధవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 20 రోజుల లోపు కాకినాడలోని రామారావుపేటలో ఉన్న దేవదాయ శాఖ ఉప కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.



కాళ్ల: లంక రోడ్డు సెంటర్‌లో ఊరేగింపు



లింగపాలెం: ధర్మాజీగూడెంలో..



గణపతి లడ్డూ రూ.90,500

టి.నరసాపురం: రాజుపోతేపల్లి గ్రామంలోని రామాలయంలో 30 కిలోల గణపతి లడ్డూను బుధవారం వేలం వేశారు. అదే గ్రామానికి చెందిన రైతు దేవరపల్లి రామారావు రూ.90,500కు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు.

గౌరీ తనయా.. నమోనమః

ఏకదంతాయ.. వక్రతుండాయ.. గౌరీతనయా.. నమోనమః స్మరణలు మార్మోగుతున్నాయి. ఊరూవాడా చవితి వేడుకలు అట్టహాసంగా జరుగుతున్నాయి. వినాయక పందిళ్లలో స్వామికి విశేష పూజలు చేస్తున్నారు. బుధవారం మూడోరోజు కావడంతో పలు ప్రాంతాల్లో గణపతి నిమజ్జనాలు ఉత్సాహంగా జరిగాయి.

– సాక్షి నెట్‌వర్క్



ఏలూరు (ఆర్ఆర్‌పేట): శాస్త్రి సెంటర్‌లో..



ద్వారకాతిరుమల: రాళ్లకుంటలో ఊరేగింపు



ఏలూరు (ఆర్ఆర్‌పేట): వెంకట్రామా సెంటర్‌లో..



ఏలూరు (ఆర్ఆర్‌పేట) : చిన్నారుల సందడి



ఏలూరు (ఆర్ఆర్‌పేట) : గంగమ్మ ఒడిలోకి గణపతి

డిసెంబర్‌లోగా '100 పడకల' నిర్మాణం పూర్తవ్వాలి

చింతలపూడి: చింతలపూడిలో రూ.22 కోట్లతో చేపట్టిన 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటికి యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. బుధవారం టి.నరసాపురం మండలంలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో పాల్గొని ఏలూరుకు తిరిగి వస్తుండగా, చింతలపూడిలో నిర్మిస్తున్న 100 పడకల ఆసుపత్రి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర సంక్షేమ పాఠశాల నిర్మాణ పనులను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను పూర్తి నాణ్యతతో చేపట్టాలన్నారు. అనంతరం గురుకుల పాఠశాల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. పనులను వేగవంతం చేసి భవనం ప్రారంభోత్సవానికి సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా ప్రధాన రహదారి నుంచి ఆసుపత్రి, గురుకుల సంక్షేమ పాఠశాల వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట డీసీహెచ్ డా.పాల్ సతీష్, మున్సిపల్ కమిషనరు నల్లా రాంబాబు, ఇన్‌చార్జి తహసీల్దార్ షకీలున్నీసా, ఎంపీడీఓ ఎం.మురళీకృష్ణ ఉన్నారు.



చింతలపూడిలో ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

గణేష్ నిమజ్జనాలకు పటిష్ట ఏర్పాట్లు

పెనుగొండ : వినాయక చవితి సందర్భంగా విగ్రహాల నిమజ్జనాలు జరిగే ముఖ్యమైన ప్రాంతాల్లో పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్పీ యూ రవిప్రకాష్ చెప్పారు. బుధవారం సిద్ధాంతంలోని కేదారీ ఘాట్‌ను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జనాలను సీసీ కెమెరాలతో పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. మండపాల వద్ద కమిటీకి సంబంధించిన వ్యక్తులు ఇద్దరు వంతున ప్రతి రోజూ రాత్రి కచ్చితంగా ఉండాలన్నారు. చవితికి ఏర్పాటు చేసే కార్యక్రమాల ప్రదర్శనకు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలన్నారు. రాత్రి 10 గంటలకే కార్యక్రమాలు ముగించాలన్నారు. అసభ్యకరమైన, అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు. కమిటీ సభ్యులు చిన్న పిల్లలకు హుండీలు ఇచ్చి రోడ్డుకు అడ్డంగా పెట్టి బలవంతంగా చందాలు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట నర్సాపురం డీఎస్పీ కె.రవిమనోహరాచారి, ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ ఉన్నారు.



సిద్ధాంతం కేదారీ ఘాట్‌లో నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

నిమజ్జనానికి పక్కా ఏర్పాట్లు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు పరిసర ప్రాంతాలలో వినాయక విగ్రహాల నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో చేసుకునేలా పక్కా ఏర్పాట్లు చేయాలని ఎస్పీ డి.మేరీ ప్రశాంతి పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ యంత్రాంగాలను ఆదేశించారు. ఈ మేరకు గణనాథులను నిమజ్జనం చేసే పలు ప్రాంతాలను ఆమె బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిమజ్జన సమయంలో ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా, అపాయలు కలగకుండా రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సమన్వయంతో జాగ్రత్తలను తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ సిబ్బందితో ఏర్పాటు చేసే క్రేన్ల ద్వారా వినాయక విగ్రహాలను తమ్మిలేరులో నిమజ్జనం చేయాలని ఉత్సవ కమిటీల ప్రతినిధులకు సూచించారు. తూర్పులాకులో విగ్రహాలను నిమజ్జనం చేయడానికి వచ్చిన భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనాలపై పోలీసులకు ముందుగా సమాచారం తెలియజేస్తే తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. నిమజ్జన ఊరేగింపులలో అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్పీ వెంట ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు, ఏలూరు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రాజశేఖర్, మునిసిపల్ అధికారులు ఉన్నారు.



ఏలూరులో నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మేరీ ప్రశాంతి

ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలపై విజిలెన్స్ దాడులు

సాక్షి, భీమవరం: పట్టణంలోని మూడు ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కరణం కుమార్ ఆదేశాల మేరకు చేసిన ఈ దాడుల్లో మూడు ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో బిల్లుల్లో వ్యత్యాసాలు గుర్తించినట్లు ఇన్‌స్పెక్టర్లు యూజే విల్సన్, పి.శివరామకృష్ణ చెప్పారు. వీఆర్ఎల్ లాజిస్టిక్స్ లిమిటెడ్, క్రాంతి రోడ్ ట్రాన్స్‌పోర్ట్ ప్రైవేట్ లిమిటెడ్, బొంబాయి ఆంధ్ర ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల్లో రూ.3,70,741 విలువైన బిల్లుల వ్యత్యాసాలను గుర్తించామన్నారు. దీనిపై సదరు సామగ్రిని స్వాధీనం చేసుకుని, బిల్లుల వ్యత్యాసాలపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సిఫారసు చేశారు. దాడుల్లో భీమవరం డీసీటీఓ హేమమాలిని, సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెదవేగి: పెదవేగిలోని జవహర్ నవోదయ విద్యాలయలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎస్ఎస్ చంద్రశేఖర్ బుధవారం చెప్పారు. విద్యాలయలో 9, 11 తరగతుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు. 9వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసే విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదువుతూ ఉండాలని, విద్యార్థి 2009 మే ఒకటో తేదీ నుంచి 2011 జూలై 31వ తేదీ మధ్య జన్మించినవారు మాత్రమే అర్హులన్నారు. అలాగే 11వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతూ ఉండాలన్నారు. 2007 జూన్ ఒకటో తేదీ నుంచి 2009 జూలై 31వ తేదీ వద్య జన్మించిన వారు మాత్రమే అర్హులన్నారు. అక్టోబర్ 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరి పదో తేదీన జరుగుతుందని తెలిపారు.

డీఈఎల్ఈడీ పరీక్షలకు 209 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్ఈడీ (డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) మొదటి, నాలుగో సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం జరిగిన మొదటి సెమిస్టర్ పరీక్షకు 71 మంది విద్యార్థులకు 69 మంది హాజరు కాగా ఇద్దరు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన నాలుగో సెమిస్టర్ పరీక్షకు 143 మంది విద్యార్థులకు 140 మంది హాజరు కాగా ముగ్గురు గైర్హాజరయ్యారు. తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్‌సుందర్ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఇద్దరు నిర్వాహకులు, ముగ్గురు విటుల అరెస్టు

భీమడోలు: పోలసానిపల్లిలోని వ్యభిచార గృహంపై బుధవారం సాయంత్రం భీమడోలు పోలీసులు ఆకస్మిక దాడి చేసి ముగ్గురు విటులతో పాటు ఇద్దరు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ వి.వెంకటేశ్వరరావు నేతృత్వంలో ఎస్సై చావా సురేష్‌కుమార్ ఈ దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. ద్వారకాతిరుమల మండలం పంగిడిగూడెంకు చెందిన పెండెం పద్మజ, రాజమండ్రికి కన్నెం శివాజీ పోలసానిపల్లిలో ఓ ఇల్లు అద్దెకు తీసుకుని రెండు నెలలుగా గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. వీరు విజయవాడ, రాజమండ్రి, గుంటూరు ప్రాంతాల్లోని యువతులకు డబ్బు ఎర చూపి వ్యభిచారం గృహాన్ని నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో విజయవాడకు చెందిన ఓ యువతి, తాడేపల్లిగూడెం, రావులపర్రులకు చెందిన ముగ్గురు విటులు ఆ ఇంట్లో ఉండగా, సమాచారం అందుకున్న సీఐ, ఎస్సై దాడి చేసి వారిని పట్టుకున్నారు. వీఆర్వో డి.సింహాచలం సమక్షంలో వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసారు. హెచ్‌సీ శ్రీనివాస్, మహిళా కానిస్టేబుళ్లు దాడిలో పాల్గొన్నారు.

వరిలో ఎలుకల బెడద

- సార్వాలో రైతులకు తప్పని సమస్య
- వరి పిలకలను కొరికేస్తుండటంతో తీవ్ర నష్టం
- సామూహిక ఎలుకల నివారణ పద్ధతే మేలు అంటున్న అధికారులు

పాడి - పంట

యలమంచిలి: వరిలో ఎలుకల బెడద ఎక్కువైంది. ముఖ్యంగా వరి పంటను మూషికాలు నాశనం చేస్తున్నాయి. సార్వా సీజన్‌లో ఆకుమడి దశ నుంచి కుప్పల వరకు ఈ సమస్య రైతులకు తప్పడం లేదు. దీంతో రైతులు అధికంగా నష్టపోతున్నారు. పంట వేసినప్పటి నుంచి చేతికి వచ్చేవరకు ఎలుకల బెడద ఉంటుంది. ఎలుకలను సమర్థవంతంగా అరికట్టాలంటే రైతులంతా సామూహిక నిర్మూలన చర్యలు చేపట్టడం వలనే సాధ్యమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వరితోపాటు ఉద్యాన పంటలైన కొబ్బరి, అరటి, కూరగాయల తోటలకు ఎలుకల బెడద ఉంది. ప్రస్తుతం వరి పంట దుబ్బు చేసి పిలకలు వేసే దశలో ఉంది. ఈ దశలో ఎలుకల వలన కలిగే నష్టం అపారంగా ఉంటుంది. ఎలుకలు నీటి మట్టానికి 6 సెంటీమీటర్ల ఎత్తులో వరి పిలకలను కొరికివేస్తున్నాయి. దీంతో దిగుబడి తగ్గి రైతులు నష్టపోయే అవకాశాలు ఎక్కువ.

ఎలుకల సంచారాన్ని ఇలా గుర్తించవచ్చు

ఎలుకలు సంచరించే పొలం గట్లపై బొరియలు ఉంటాయి. పొలంలో కొరికి వేసిన వరి పిలకలు, దుబ్బులు పడి ఉంటాయి. పొలంలోని బురదలో ఎలుకల పాదముద్రలు కనిపిస్తాయి. ఎలుకలు విసర్జించిన పదార్థాల ద్వారా వాటి ఉనికిని సులభంగా గుర్తించవచ్చును.

నివారణ చర్యలు

ముందుగా రైతులు తమ పొలం గట్లపై కలుపు మొక్కలను పూర్తిగా తొలగించి శుభ్రం చేసుకోవాలి. ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా బ్రొమోడయోలోన్ అనే ఎరను రైతులకు ఉచితంగా సరఫరా చేస్తోంది. రైతులు ఈ ఎరను తెచ్చుకుని ఎలుకలను నివారించుకోవచ్చు. 480 గ్రాముల నూకలు, 10 గ్రాముల బ్రొమోడయోలిన్ మందు, 10 గ్రాముల నూనెతో 500 గ్రాముల ఎరను తయారు చేసుకోవచ్చు. ఈ ఎర 50 ఎలుక బొరియలకు సరిపోతుంది. మొదటి రోజు ఎలుక బొరియలను గుర్తించి మట్టితో కప్పివేయాలి. రెండో రోజు మట్టితో కప్పిన బొరియలను చూస్తే అవి తెరుచుకుని కనిపిస్తాయి. ఈ బొరియల వద్ద 10 గ్రాముల బ్రొమోడయోలిన్ ఎర పొట్లాలను ఉంచాలి. దీంతో ఆ ఎరను తిన్న ఎలుకలు చనిపోతాయి. ఇక రెండో విధానంలో వేటగాళ్లతో ఎలుక బుట్టలు వేయించి ఎలుకలను అరికట్టవచ్చు. అయితే ఈ విధానంలో వేటగాళ్లు ఒక్కో ఎలుకకు రూ.60 వరకు తీసుకుంటారు. మరొక విధానంలో ఎలుక బొరియలో పొగ పెట్టి ఎలుకలను చంపుతారు. ఇలా చేస్తే ఒక్కో ఎలుకకు రూ.100 తీసుకుంటారు. ఈ రెండు విధానాలు అధిక ఖర్చుతో కూడిన పని కావడంతో రైతులంతా బ్రొమోడయోలోన్ ఎర ద్వారానే ఎలుకల నివారణ చేయడం సులభంగా జరిగే పని అని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అయితే ఏ విధానంలో చేసినా రైతులంతా సామూహికంగా ఈ పని చేస్తేనే ఎలుకలను సమర్థవంతంగా అరికట్టవచ్చని వారు సూచిస్తున్నారు.



ఎలుకలను పట్టడానికి బుట్టలు సిద్ధం చేస్తున్న వేటగాడు



వరి పంటను కొరుకుతున్న ఎలుక

సామూహికంగానే చేపట్టాలి



సార్వా పంటకు ఎలుకల బెడద ఎక్కువగానే ఉంటుంది. ఎవరికి వారు ఎలుకలను పూర్తిగా నిర్మూలించడం సాధ్యం కాదు. సామూహికంగా బ్రొమోడయోలిన్ మందును బొరియల్లో పెట్టడం ద్వారా మాత్రమే సమర్థంగా అరికట్టగలం. ఎలుకలను అరికట్టడానికి అవసరమైన బ్రొమోడయోలిన్ మందు కొద్ది రోజుల్లో రైతు భరోసా కేంద్రాలకు వస్తుంది. దీనిపై రైతులకు ప్రతి ఏడాది అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, మందును ఉచితంగా అందిస్తున్నాం.

– చిందులూరి దేవి, మండల వ్యవసాయాధికారి, యలమంచిలి

బాలింతలకు రక్షగా తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు

- తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో 6 వాహనాల ద్వారా సేవలు
- నిత్యం 10 నుంచి 15 మందిని తరలిస్తున్న వైనం


తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎక్కుతున్న బాలింత, సహాయకులు

తణుకు అర్బన్: ప్రసవం అయిన తరువాత బాలింతలను సురక్షితంగా ఇంటికి చేర్చే విషయంలో తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన సేవలు అందరి మన్ననలు అందుకుంటున్నాయి. గర్భిణులు నెలలు నిండిన తరువాత 108 వాహనాల ద్వారా తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేరుతుండగా, ప్రసవానంతరం తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా బాలింతలు జిల్లాలోని వివిధ గ్రామాల్లోని తమ సొంత ప్రాంతానికి చేరుకుంటున్నారు. గతంలో ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించి ఇబ్బందులపాలయ్యే పరిస్థితి ఉండగా, ఇప్పుడు ఆ పరిస్థితులను అధిగమించి తల్లీ బిడ్డ వాహనాలు విశేష సేవలందిస్తున్నాయి.

6 వాహనాల ద్వారా..

తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో 6 వాహనాల ద్వారా ప్రతిరోజూ 10 నుంచి 15 కేసుల వరకు బాలింతలను వారి స్వస్థలాలకు చేరుస్తున్నారు. 150 పడకలున్న తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిత్యం 500లకు పైగా అవుట్ పేషెంట్స్ వస్తుండగా అందులో 150 వరకు గర్భిణులు వస్తుంటారు. వీరిలో నార్మల్ డెలివరీలు, సిజేరియన్‌లు కలిపి రోజుకు 15 నుంచి 20 మంది గర్భిణులు వైద్యసేవలు పొందుతున్నారు. సులువుగా ప్రసవం అయిన బాలింతలు 3 రోజులకు, సిజేరియన్ చేయించుకుని బిడ్డను కన్న బాలింతలు 9వ రోజున ఇంటికి పంపిస్తుంటారు. ఈ క్రమంలో ప్రతిరోజూ ప్రసవాలకు సంబంధించిన వార్డులో ఉన్న వైద్య సిబ్బంది ఇచ్చిన వివరాల ప్రకారం తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన సిబ్బంది జిల్లా నలుమూలలకు బాలింతలను సురక్షితంగా దించి వస్తుంటారు.

తల్లీబిడ్డ వాహన సేవలిలా

ఏప్రిల్	169
మే	238
జూన్	195
జూలై	209
ఆగస్టు	252
సెప్టెంబరు	122

సురక్షితంగా చేరుస్తున్నాం..



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ప్రసవమైన బాలింతలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా సురక్షితంగా ఇంటికి చేరుస్తున్నాం. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న 6 వాహనాల ద్వారా ప్రతిరోజూ సుమారుగా 10 నుంచి 15 మంది బాలింతలు వారి స్వస్థలాలకు వెళ్తున్నారు.

– డాక్టర్ వెలగల అరుణ, ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి

ఆటోల ప్రయాణం మంచిది కాదని...



తల్లీబిడ్డ వాహనాలు అందుబాటులో లేని రోజుల్లో ప్రభుత్వాసుపత్రి నుంచి బాలింతలు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల ద్వారా వారి ఇళ్లకు చేరే పరిస్థితి ఉండేది. కానీ తల్లీబిడ్డ వాహనాలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఎటువంటి ఇబ్బందులు లేకుండా బాలింతను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అవ్వగానే వాహన సిబ్బంది వెళ్లి స్వయంగా రిసీవ్ చేసుకుని వారి ఇంటిముందు దింపుతున్నారు.

– డాక్టర్ దాట్ల సుందరరామరాజు, తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షులు

క్లుప్తంగా

దాతల సహకారంతో పల్లెలు అభివృద్ధి సాధిస్తాయి


కలర్ ప్రింటర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ కట్టా దానయ్య, ఎంపీటీసీ డి.సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీటీసీ): దాతల సహకారంతో పల్లెలు అభివృద్ధి సాధిస్తాయని బి.కొండేపాడు సర్పంచ్ కట్టా దానయ్య అన్నారు. పెంటపాడు మండలంలోని కొండేపాడు గ్రామంలోని నెంబర్ 2 పాఠశాలకు గ్రామ దాత వరద పూర్ణయ్య దంపతులు రూ.12 వేలు విలువైన కలర్ ప్రింటర్‌ను బహుకరించారు. ఎంపీటీసీ దేవరశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలు మెండుగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ పిల్లి ఎల్లారేశ్వరీ, ప్రధానోపాధ్యాయులు సీహెచ్‌వీ గణేష్, టి.నాగరాజు, బి.సత్యనారాయణ, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ఈ నెల 22, 23వ తేదిల్లో సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం నిర్వహించనున్నట్టు మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్.ప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. మండలానికి 122 కిలోల ఎలుకల నివారణ మందు వచ్చిందన్నారు. ఈ నెల 22వ తేదిన ఎలుక బొరియలను గుర్తించి, మూసివేయాలన్నారు. శనివారం ప్రతీ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. తెరిచి ఉన్న బొరియల్లో ఎలుకల నివారణ మందును పెట్టాలని, రైతులంతా ఈ కార్యక్రమం సామూహికంగా చేయడం వల్ల ప్రయోజనం ఉంటుందని ఏవో ప్రసాద్ సూచించారు.

స్కేటింగ్‌లో సత్తా చాటిన మాంటిస్సోరీ విద్యార్థులు


తణుకులో స్కేటింగ్‌లో పతకాలు సాధించిన మాంటిస్సోరీ స్కూల్ విద్యార్థులు

తణుకు అర్బన్: ఏలూరులో ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించిన జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీల్లో తణుకు మాంటిస్సోరీ స్కూల్ విద్యార్థులు సత్తాచాటి బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. అండర్–7 విభాగం స్కేటింగ్ ఇన్‌లైన్ పోటీల్లో 1వ తరగతి విద్యార్థి ఎ.శ్రీహరి ప్రకాష్ మొదటిస్థానంలో నిలిచి 2 బంగారు పతకాలు, కె.మోహిత్ కుమార్ 2 కాంస్య పతకాలు, అండర్ 9 విభాగంలో స్కేటింగ్ క్వాడ్ పోటీల్లో 3వ తరగతి విద్యార్థిని కె.పద్మశ్రీ రెండో స్థానంలో నిలిచి 1 వెండి, 3 కాంస్య పతకాలు, 4వ తరగతికి చెందిన సి.కన్షిక్ వర్మ 2 బంగారు, 1 వెండి పతకాలు సాధించినట్లు వివరించారు. విద్యార్థుల్లో క్రీడలపట్ల ఆసక్తి చూపేవారిని ఎంపికచేసి ఏ క్రీడల్లో రాణించగలరో ఆ క్రీడల్లో వారికి శిక్షణ ఇస్తున్నట్లుగా స్పష్టం చేశారు. ఈ సందర్భంగా శిక్షణనిచ్చిన స్కేటింగ్ కోచ్ ఎ.భార్గవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ


కడియద్దలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ మురళీకృష్ణ, ఏవో ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్ : మండలంలోని కడియద్ద, పెదతాడేపల్లి గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను బుధవారం వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ, ఏవో ఆర్‌ఎస్.ప్రసాద్‌లు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఏడీఏ మురళీకృష్ణ మాట్లాడుతూ స్టాక్ రికార్డులకు, భౌతిక నిల్వల్లో వ్యత్యాసాలను గుర్తించామని, 48 గంటల్లో వాటిని సరి చేసుకోవాలన్నారు. లేకుంటే పూర్తి స్థాయిలో లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎరువులు విక్రయించిన వెంటనే కొనుగోలుదారునితో వేలిముద్ర వేయించాలన్నారు. ఏవో ఆర్‌ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ రైతుకు 25 బస్తాలకు మించి యూరియా విక్రయించరాదన్నారు. బయో ఉత్పత్తులకు జీ2, జీ3 అనుమతులు ఉండాలన్నారు.

ఘనంగా ఏఎస్ రావు జయంతి

పాలకోడేరు: మోగల్లులోని శ్రీ అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో డాక్టర్ ఏఎస్ రావు 109వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసీఐఎల్ ఆఫీసర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, రిటైర్డ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ విశ్వనాథ జగదీష్, ఈసీఐఎల్ సీనియర్ మేనేజర్ బీవీఎస్ఎన్ ప్రసాద్, ఎస్.వెంకటరావులు ఏఎస్ రావు సేవలను కొనియాడారు. తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చిగురుపాటి జయంతి మాణిక్యాలరావు, డాక్టర్ శివశంకర్, డాక్టర్ పి.ప్రతాప్ వర్మ, ప్రధానోపాధ్యాయులు కానూరి వెంకటబాబు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ దుర్గాకిషోర్, పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో తహసీల్దార్‌వై.దుర్గా కిషోర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రాలు, చేర్పులు – మార్పులు వంటి విషయాలను తహసీల్దార్ దుర్గా కిషోర్ వివరించారు. ఎటువంటి సమస్యలున్నా తెలియజేయాలని కోరారు. ఎన్నికల అధికారి ఎ.దుర్గేష్, డిప్యూటీ తహసీల్దార్ అనూరాధ, రాజకీయ పార్టీ ప్రతినిధులు కైకాల శ్రీనివాస్, పట్నాల రాంపండు, కళింగ లక్ష్మణరావు, పాటే నాగేశ్వరరావు, కిలపర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా రైతులను ఆదుకోవాలి

ఉండి: జిల్లాలోని ఆక్వా రైతులకు మరింత మద్దతు ధర అందించి వారిని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు రాష్ట్ర రైతు సంఘ జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్ తెలిపారు. బుధవారం ఉండి సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.

విశిష్ట రూపా.. వినాయకా..


తణుకు అర్బన్: కొచ్చెర్లకోట వారి వీధిలో పూజలందుకుంటున్న భారీ వినాయకుడు


తాడేపల్లిగూడెం రూరల్: మండలం పెదతాడేపల్లి గ్రామంలో గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం


తాడేపల్లిగూడెం (టీటీసీ): శ్రీకృష్ణమందిరంలో వినాయక స్వామి

- వివిధ అలంకరణల్లో ఆకట్టుకున్న పందిళ్లు, స్వామివారి విగ్రహాలు
- విశేషంగా దర్శించుకున్న భక్తులు

తణుకు అర్బన్: గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్థానిక కొచ్చెర్లకోట వారి వీధిలో శ్రీలక్ష్మీగణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయకుడికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా తీసుకువచ్చిన 18 అడుగుల భారీ వినాయక విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామివారిని వీక్షించేందుకు పట్టణ నలుమూలల నుంచి భక్తులు భారీ సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుని సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఉత్సవకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. మహోత్సవాల్లో భాగంగా వినాయక మండపాన్ని సైతం ప్రత్యేక అలంకరించారు.

తాడేపల్లిగూడెంలో...

తాడేపల్లిగూడెం (టీటీసీ): వినాయక చవితి మహోత్సవాలు సందర్భంగా మూడోవ రోజు బుధవారం రామచంద్రరావుపేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలోని అభయ గణపతికి షోడశోపచార, సహస్ర నామ పూజలు జరిగాయి. భక్తులు విశేషంగా పూజలు జరిపారు. మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు. అలాగే పట్టణంలోని రామారావుపేటలోని గణేష్ యూత్ గణపతి నవరాత్రి మహోత్సవాల్లో బుధవారం రాత్రి ఉత్సవ పందిరి వద్ద కోలాట భజన నిర్వహించారు. ఈ భజన కార్యక్రమం ఆహుతులను అలరించింది. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోన్ చైర్‌పర్సన్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, డైమండ్స్ అధ్యక్షుడు రమణయ్య, కె.వెంకటేశ్వరరావు, సత్యదేవ్, సూరిబాబు, రుద్రా తదితరులు పాల్గొన్నారు.

పెదతాడేపల్లిలో...

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పలు కూడలి ప్రాంతాల్లో నెలకొల్పిన గణనాథులు బుధవారం నిమజ్జనాలకు బయల్దేరారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివార్లకు ఉద్వాసన పూజలు నిర్వహించారు. ప్రధానంగా పట్టణంలోని కృష్ణుడి గుడి పక్క వీధి, పాత పోస్టాఫీస్ రోడ్డు, మండలంలోని పెదతాడేపల్లి బీసీ కాలనీ, జగనన్న కాలనీలో నెలకొల్పిన గణనాథులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఉంచి వీధి వీధినా ఊరేగించారు. అనంతరం పట్టణ ప్రాంతాల వారు గోదావరి ఏలూరు కాలువలోనూ, గ్రామీణ ప్రాంతాల్లోని ఉత్సవ నిర్వాహకులు స్థానికంగా ఉన్న చెరువులోనూ గణనాథులను వెళ్లి రావయ్యా... మళ్లీ రావయ్యా అంటూ నిమజ్జనం చేశారు. యువకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

అథ్లెటిక్ పోటీల్లో సత్తా చాటిన 'భవన్స్' విద్యార్థులు


అథ్లెటిక్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్ విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: జిల్లా స్థాయిలో గోపన్నపాలెం గ్రామంలో జరిగిన అథ్లెటిక్ పోటీల్లో తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్‌కు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రాంగణంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అండర్–18 బాలుర పరుగు పందెంలో ఎ.భార్గవ నాగసాయి, లాంగ్ జంప్‌లో ఎస్.సక్షమ్, ఎం.అనిమేష్, అండర్–16 బాలుర డిస్కస్ త్రోలో ఎ.అవినాష్, 800 మీటర్ల పరుగు పందెంలో ఇ.దర్శల్, 2వేల మీటర్ల విభాగంలో వై.ఈశ్వర్ రామన్ చందు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రాజీవ్‌కుమార్ శర్మ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం స్కూల్ ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలని ఆయన ఆకాంక్షించారు. విద్యార్థులను స్కూల్ చైర్మన్, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు (రంగరాజు), పాలకవర్గ సభ్యులు, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

స్కూల్ గేమ్స్‌లో ప్రతిభకనబర్చిన దండగర్ర విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో మండలంలోని దండగర్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభకనబర్చారు. 600 మీటర్ల రన్నింగ్, హైజంప్‌లోనూ ఎం.కోటలక్ష్మి ద్వితీయ, 800మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానాలను ఎం.సుష్మిత సాధించారు. అలాగే, ఊబా వెంకటేష్ 100 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ, 600 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ, లాంగ్ జంప్‌లో ప్రథమ, 800 మీటర్ల రన్నింగ్‌లో ఆర్.కౌశిక్ తృతీయ, డి.సుమలత తృతీయ స్థానాలు సాధించినట్లు స్కూల్ హెచ్‌ఎం సీహెచ్.చంద్రశేఖర్ బుధవారం వివరించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి


తణుకులో దీక్షలు చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులు

తణుకు: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు అబ్బదాసరి లాజర్‌మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణమాదిగ ఆదేశాలు మేరకు తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం నిరసన దీక్షలు చేపట్టారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ విస్సంపల్లి సిద్దుమాదిగ ఆధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లాజర్ మాదిగ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా వర్గీకరణ కోసం పోరాటాలు చేస్తున్నప్పటికీ మాదిగలకు న్యాయం జరగడం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడితే 59 ఉప కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. రాష్ట్ర నాయకులు అబ్బదాసరి కల్యాణ్ మాదిగ, లంకా శేఖర్‌బాబు, నాయకులు ప్రవీణ్, గరగ జ్యోతి, రామలక్ష్మి, సలోమాన్, బ్రహ్మాజీ, బెన్నీ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

తాడేపల్లిగూడెం (టీటీసీ): ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ బుధవారం పట్టణంలోని తాలూకా ఆఫీస్ సెంటర్‌లో ఎంఆర్‌పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ ఆదేశాలతో ఎంఆర్‌సీఎస్ మండల నాయకులు ఆధ్వర్యంలో నిరసన దీక్ష శిబిరం నిర్వహించారు. మండల అధ్యక్షుడు కొల్లి రాజశేఖర్ మాదిగ, ఎంఎస్‌పీ ఇంచార్జి విస్సంపల్లి సిద్దు మాదిగలు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ సమావేశాలలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యులు గెద్దాడ విమలాదేవిలు శిబిరాన్ని సందర్శించారు. మొదటి రోజు దీక్షలను విజిలెన్స్ కమిటీ సభ్యులు తెన్నేటి జగ్జీవన్ నిమ్మరసం ఇచ్చి విరమింప చేశారు. ఈ దీక్షల్లో లంక రాజశేఖర్, ఆనంద్, చదలవాడ అజయ్‌కుమార్, రవి, ఏసు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారుల ప్రోత్సాహానికే పోటీలు


తణుకులో స్కూల్ గేమ్స్ జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

తణుకు అర్బన్: క్రీడలతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, విద్యతోపాటు క్రీడల్లోను విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా సెక్రటరీ జాన్సన్ అన్నారు. తణుకు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ క్రీడా పోటీలు, సెలక్షన్స్‌లో భాగంగా తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో బుధవారం 14 నుంచి 17 సంవత్సరాల్లోపు బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. అథ్లెటిక్స్, యోగా, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాట్మింటన్, త్రోబాల్, టెన్నీకాయిట్, బాల్ బ్యాట్మింటన్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో తణుకు నియోజకవర్గ పరిధిలోని తణుకు పట్టణం, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాల నుంచి విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. 320 మంది క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు రానున్న రోజుల్లో నిర్వహించే జిల్లాస్థాయి పోటీలకు ఎంపికవుతారని ఎస్‌జీఎఫ్ తణుకు నియోజకవర్గ కో–ఆర్డినేటర్ సంకు సత్యనారాయణ తెలిపారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జీజే ప్రభువరం, తణుకు డివిజన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘ అధ్యక్షుడు నంద రంగ అప్పారావు, తణుకు, ఇరగవరం, అత్తిలి మండల స్పోర్ట్స్ కో–ఆర్డినేటర్స్ జి.రవి, కేవీఆర్ సుబ్బారావు, వైఎస్ సోమయాజులు, నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


షటిల్ పోటీలను ప్రారంభిస్తున్న వాకర్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీటీసీ): క్రీడలతో మానసిక ఉల్లాసం సాధ్యపడుతుందని వాకర్స్ అధ్యక్షుడు కెవీ చలం తెలిపారు. ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ 18వ వార్షికోత్సవం సందర్భంగా వాకర్స్ సభ్యులకు బుధవారం షటిల్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా చలం మాట్లాడుతూ షటిల్ పోటీలు రెండు రోజుల పాటు కొనసాగుతాయని, 23వ తేదీన శనివారం నడక, రన్నింగ్, షార్ట్‌పుట్ పోటీలు జరుగుతాయని వెల్లడించారు. విజేతలకు అక్టోబర్ 2వ తేదీన బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.కుమారస్వామి, కోశాధికారి పి.వి.పరమాత్మ, వ్యవస్థాపక కార్యదర్శి బొండాడ ఐజాక్ రాజేంద్ర, కె.నరసింహమూర్తి, ప్రవా శ్రీనివాస్, మాకా శ్రీనివాసరావు, వాకర్స్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



పోషణ మహా మాసోత్సవాలలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తణుకు టౌన్: పౌష్టికాహార వారోత్సవాల్లో భాగంగా తణుకు రూరల్ మండలంలోని దువ్వ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు, విద్యార్థినులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ చిరుదాన్యాలతో పోషకాహారాన్ని తయారు చేసుకోవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు. మండపాక గ్రామంలో నిర్వహించిన పౌష్టికాహార వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్ వైజర్ వీవీకేఎస్ కృష్ణకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని పోషకాహారం గురించి వివరించారు. ఈకార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతంగా ఇండియన్ స్వచ్ఛత లీగ్


దండిమార్చ్ విగ్రహాలను శుభ్రపరచిన సచివాలయ సెక్రటరీలు, ఎస్‌కేఎస్ఐఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

తణుకు అర్బన్: పరిసరాల పరిశుభ్రతకు పౌరులంతా నడుంకట్టాలని మునిసిపల్ కమిషనర్ కేటీ సుధాకర్ అన్నారు. కేంద్ర పట్టణ, గృహ నిర్మాణం మంత్రిత్వ శాఖ, ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇండియన్ స్వచ్ఛత లీగ్ (సీజన్2)లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో బుధవారం పలు ప్రాంతాల్లో క్లీనింగ్ నిర్వహించారు. ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు రైల్వే స్టేషన్, బస్సు స్టాండ్, కొమ్మాయి చెరువు, ఎన్టీఆర్ పార్కు, దండిమార్చ్ విగ్రహాలను క్లీనింగ్‌తో పాటు పలు ప్రాంతాల్లో మొక్కలు నాటి కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కూడా భాగస్వామం అయినట్లు వివరించారు. మునిసిపల్ డీఈఈ కొవ్వూరి ఈశ్వరరెడ్డి, ఏఈ రామకిషోర్, శానిటరీ ఇనస్పెక్టర్ గోవిందయ్య, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు


జువ్వలపాలెం వద్ద నిమజ్జన ఘాట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ నాగరాజు, సిబ్బంది

తాడేపల్లిగూడెం అర్బన్ : వినాయక విగ్రహాలను నిమజ్జనంలో నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పని సీఐ నాగరాజు హెచ్చరించారు. తాడేపల్లిగూడెంలోని 16వ వార్డు జువ్వలపాలెం వద్ద నిమజ్జన ఘాట్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీఐ నాగరాజు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రవిప్రకాష్ ఆదేశాల మేరకు వినాయక నిమజ్జనం సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఈ ఏడాది జువ్వలపాలెం వద్ద నిమజ్జన ఘాట్‌ను ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జన కార్యక్రమంలో క్రేన్ నెంబర్లు 1, 2, 3, 4 క్రేన్ల ద్వారా నిర్వహిస్తామన్నారు. వినాయక నిమజ్జనం వద్ద బారికేట్లు, భారీ బందోబస్తు, లైటింగ్, సౌండ్‌సిస్టమ్స్, సిసి కెమెరాలు పర్యవేక్షణ ఏర్పాటు చేశామన్నారు. నిమజ్జన ఊరేగింపులలో చిన్నపిల్లలను తీసుకురావద్దని హెచ్చరించారు. చవితి పందిళ్ల నిర్వాహకులు నిమజ్జన కార్యక్రమాలకు పోలీసులకు సహకరించాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శిపై విచారణ

పాలకోడేరు: మోగల్లు పంచాయతీ కార్యదర్శి కనుమూరి వెంకటరాజుపై కె.శ్యామ్‌కుమార్, గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం పంచాయతీరాజ్ గ్రామాభివృద్ధి విస్తరణాధికారి కాకర్లమూడి నాగేంద్ర కుమార్ విచారణ నిర్వహించారు. గతంలో వార్డు మెంబర్లు పంచాయతీ కార్యదర్శి అవినీతికి పాల్పడుతున్నారని ఇచ్చిన ఫిర్యాదుపై ఏప్రిల్ 11వ తేదీన ఈవోపీఆర్డీ రెడ్డయ్య విచారణ చేయడం రుజువుపరచడం, ఆ నివేదిక ఎంపీడీవో డీపీవోకు నివేదించినా ఇంతవరకు చర్యలు లేవని, వెంటనే చర్యలు తీసుకోవాలని తదితర ఆరోపణలతో జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ విచారణ చేశారు.

ఆరోగ్య సమాజానికి కృషి చేయాలి

కాళ్ల: ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకివీడు ఐసీడీఎస్ సీడీపీఓ వాణీవిజయరత్నం అన్నారు. 'పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రం కాళ్లలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహార లోపం నివారణకు ఐసీడీఎస్ ద్వారా ప్రభుత్వం 'పోషణ్ మా' మాసోత్సవాలకు శ్రీకారం చుట్టిందన్నారు. చిరుదాన్యాలతో పోషకాహారాన్ని తయారు చేసుకోవచ్చని తెలిపారు. బాలింతలు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్, ఈవోపీఆర్డీ భాస్కరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ హేమలత, సూర్య కుమారి, ఎంఈఓ 2 జి.కనకరాజు, అంగన్వాడీ కార్యకర్తలు బేబీ, ఝాన్సీ, లక్ష్మి పాల్గొన్నారు.



పతాకధారులుగా హర్మన్‌ప్రీత్ సింగ్, లవ్లీనా

ఆసియా క్రీడల ప్రారంభ వేడుకల్లో భారత బృందానికి పతాకధారులుగా పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మహిళా స్టార్ బాక్సర్ లవ్లీనా బొర్గోహైన్ వ్యవహరించనున్నారు. ఈనెల 23న చైనాలోని హాంగ్జౌ నగరంలో ఆసియా క్రీడలకు తెర లేవనుంది. అస్సాంకు చెందిన 25 ఏళ్ల లవ్లీనా టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం, ఈ ఏడాది ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది. పంజాబ్‌కు చెందిన హర్మన్ భారత్ తరఫున 191 మ్యాచ్‌లు ఆడి 155 గోల్స్ చేశాడు.

రష్మిక శుభారంభం



అంతర్జాతీయ మహిళల టెన్నిస్ (ఐటీఎఫ్) టోర్నమెంట్‌లో హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మిక శుభారంభం చేసింది. సింగిల్స్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్ చేరిన ఆమె, డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. పెర్త్‌లో జరిగిన సింగిల్స్ తొలి రౌండ్‌లో రష్మిక 6-3, 6-3తో జెస్సీ కులే (ఆస్ట్రేలియా)పై గెలిచింది. డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక (భారత్)-మోనిక్ బ్యారీ (న్యూజిలాండ్) ద్వయం 6-4, 7-6 (7/5)తో ఎలీనా మిసిచ్ (ఆస్ట్రేలియా)-మిచికా ఒజెకి (జపాన్) జంటను ఓడించింది.

భారత్ సంచలనం

వాలీబాల్‌లో కొరియాపై విజయం • ఆసియా క్రీడల్లో నాకౌట్ దశకు అర్హత



హాంగ్జౌ (చైనా): మూడున్నర దశాబ్దాల పతక నిరీక్షణకు తెరదించాలనే లక్ష్యంతో ఆసియా క్రీడల్లో బరిలోకి దిగిన భారత పురుషుల వాలీబాల్ జట్టు తొలి అడ్డంకిని అధిగమించింది. గ్రూప్ 'సి'లో టాప్ ర్యాంక్‌లో నిలిచి నాకౌట్ దశకు అర్హత సాధించింది. మంగళవారం కంబోడియా జట్టును ఓడించిన భారత జట్టు బుధవారం పెను సంచలనం సృష్టించింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 27వ స్థానంలో ఉన్న దక్షిణ కొరియా జట్టును భారత్ బోల్తా కొట్టించింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో భారత జట్టు 25-27, 29-27, 25-22, 20-25, 17-15తో దక్షిణ కొరియాపై గెలిచింది. 1966 నుంచి ప్రతి ఆసియా క్రీడల్లో దక్షిణ కొరియా స్వర్ణ, రజత, కాంస్య పతకాల్లో ఏదో ఒక పతకం సాధిస్తూ వస్తోంది. భారత జట్టు చివరిసారి 1986 సియోల్ ఆసియా క్రీడల్లో కాంస్య పతకం గెలిచింది. కొరియాతో 2 గంటల 38 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు సమష్టి ప్రదర్శన కనబరిచింది. ముఖ్యంగా అమిత్ అత్యధికంగా 24 పాయింట్లు స్కోరు చేశాడు. వినిత్ కుమార్, అశ్వల్ రాయ్ 19 పాయింట్ల చొప్పున సాధించారు. మనోజ్ ఎనిమిది పాయింట్లు, ఎరిన్ వర్గీస్ ఏడు పాయింట్లు అందించారు. 2018 జకార్తా ఆసియా క్రీడల్లో కొరియా రజత పతకం నెగ్గగా, భారత్ 12వ స్థానంలో నిలిచింది.

రోయింగ్‌లో జోరు...

రోయింగ్‌లో భారత క్రీడాకారులు తమ ఆధిపత్యాన్ని చాటుకున్నారు. జస్విందర్ సింగ్, భీమ్ సింగ్, పునీత్ కుమార్, ఆశిష్‌లతో కూడిన భారత పురుషుల జట్టు కాక్స్‌లెస్ ఫోర్ ఈవెంట్‌లో ఫైనల్‌కు చేరింది. మహిళల కాక్స్‌డ్ ఎయిట్ ఈవెంట్‌లో అశ్వతి, మృణమయి సాల్గావ్‌కర్, ప్రియా దేవి, రుక్మిణి, సొనాలీ, రీతూ, వర్ష, తెన్‌దోన్‌తోయ్ సింగ్, గీతాంజలిలతో కూడిన భారత జట్టు కూడా ఫైనల్లోకి ప్రవేశించింది.

నేడు మలేసియాతో భారత మహిళల పోరు



మహిళల టి20 క్రికెట్‌లో భారత నేరుగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడనుంది. మలేసియాతో నేడు జరిగే పోరులో స్మృతి మంధాన బృందం బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్‌లో భారత్ గెలిస్తే సెమీఫైనల్‌కు చేరడంతో పాటు పతకం రేసులో నిలుస్తుంది. ఉదయం గం. 6:30 నుంచి మొదలయ్యే ఈ మ్యాచ్‌ను సోనీ స్పోర్ట్స్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది.

సిరాజ్ మళ్లీ నంబర్‌వన్

ఐసీసీ బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానానికి భారత పేసర్

దుబాయ్: ఆసియా కప్ ఫైనల్లో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టిన భారత పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో 694 పాయింట్లతో నంబర్‌వన్‌గా నిలిచాడు. ఇప్పటి వరకు 9వ స్థానంలో ఉన్న ఈ హైదరాబాదీ ఏకంగా ఎనిమిది స్థానాలు మెరుగుపర్చుకొని అగ్రస్థానానికి చేరుకోవడం విశేషం. వన్డే ర్యాంకింగ్స్‌లో సిరాజ్ టాప్‌గా నిలవడం ఇది రెండోసారి. ఈ ఏడాది జనవరిలో నంబర్‌వన్‌గా నిలిచిన అతను రెండు నెలల తర్వాత ఆసీస్ పేసర్ జోష్ హాజెల్‌వుడ్‌కు ఆ స్థానాన్ని కోల్పోయాడు. ఆసియా కప్ ఫైనల్లో 21 పరుగులకే 6 వికెట్లు తీసిన ప్రదర్శనతో ఇప్పుడు మళ్లీ శిఖరానికి చేరాడు. కెరీర్‌లో అత్యుత్తమ దశను చూస్తున్న సిరాజ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో భావోద్వేగ పోస్ట్ చేశాడు. కొంత కాలం క్రితం చనిపోయిన తన తండ్రిని గుర్తు చేసుకుంటూ 'మిస్ యు పాపా' అంటూ క్యాప్షన్ పెట్టాడు. తనను తల్లిదండ్రులు ఆశీర్వదిస్తున్న ఫోటోను వారిద్దరు చూస్తున్న చిత్రానికి తాను గ్రౌండ్‌లో ఆడుతున్న ఫోటోను అతను జత చేశాడు.



అమెరికాలోని మూడు నగరాల్లో...

టి20 ప్రపంచకప్ వేదికలు ఖరారు



దుబాయ్: వచ్చే ఏడాది జరిగే టి20 ప్రపంచకప్‌నకు సంబంధించి అమెరికాలోని మూడు వేదికల వివరాలను అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. న్యూయార్క్, డాలస్, ఫ్లోరిడా నగరాల్లో వరల్డ్ కప్ మ్యాచ్‌లు జరుగుతాయి. బ్రోవార్డ్ కౌంటీ (ఫ్లోరిడా), గ్రాండ్ ప్రయరీ (డాలస్), ఐసన్‌హోవర్ పార్క్ (న్యూయార్క్) స్టేడియాల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తామని ఐసీసీ పేర్కొంది. టి20 ప్రపంచకప్ అమెరికాలో జరగడం ఇదే మొదటిసారి. 2024 టోర్నీని వెస్టిండీస్‌తో కలిసి యూఎస్‌ఏ సంయుక్తంగా నిర్వహించనుంది. ఈ టోర్నీలో మొదటిసారి 20 జట్లు పాల్గొనబోతున్నాయి. ఇటీవలి వరకు ఈ టోర్నీని అమెరికాలో నిర్వహించడంపై సందేహాలు ఉన్నా ఐసీసీ తాజా ప్రకటనతో సందిగ్ధత తొలగింది. వచ్చే ఏడాది జూన్ 4-జూన్ 30 మధ్య టోర్నీ జరిగే అవకాశాలు ఉన్నాయి.

'నా అకౌంట్‌లో 80 వేలే ఉన్నాయి'

భారత నంబర్‌వన్ టెన్నిస్ ప్లేయర్ సుమిత్ నగాల్ ఆవేదన



న్యూఢిల్లీ: అతను భారత నంబర్‌వన్ టెన్నిస్ ఆటగాడు... ఏడాది మొత్తం ప్రపంచవ్యాప్తంగా ఏటీపీ టోర్నీలలో పాల్గొంటున్నాడు. టోర్నీల్లో ప్రదర్శనకు ప్రైజ్‌మనీ కూడా దక్కుతుంది. మామూలుగా అయితే టెన్నిస్ ఆటగాళ్లు బాగా డబ్బున్నవాళ్లు అయి ఉంటారని, ఏ స్థాయిలో ఆడినా విలాసవంతమైన జీవితం ఉంటుందనిపిస్తుంది. కానీ ప్రపంచ టెన్నిస్‌లో వాస్తవ పరిస్థితి వేరు. అది ఎంత ఖరీదైందో... అగ్రశ్రేణి స్టార్లు తప్ప 100 కంటే ఎక్కువ ర్యాంక్ ఉన్న ఆటగాళ్ల స్థితి ఎంత ఇబ్బందికరంగా ఉంటుందో చెప్పేందుకు ఇది చక్కటి ఉదాహరణ! భారత్‌కు చెందిన ప్రపంచ 159వ ర్యాంకర్ సుమీత్ నగాల్ ప్రస్తుతం తీవ్రమైన ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాడు. తన బ్యాంక్ అకౌంట్‌లో ఇప్పుడు 900 యూరోలు (సుమారు రూ. 80 వేలు) మాత్రమే ఉన్నాయని అతను ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు ప్రైజ్‌మనీల ద్వారా వచ్చిన డబ్బు, ఐఓసీఎల్ కంపెనీ జీతం, మహా టెన్నిస్ ఫౌండేషన్ ఇచ్చే ఆర్థిక సహాయం మొత్తం టెన్నిస్‌లోనే పెడుతున్నానని, అయినా సరే పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉందని వెల్లడించాడు. డబ్బులు లేకపోవడంతో ఫిజియో కూడా లేకుండా ఒకే ఒక కోచ్‌తో తాను పోటీల్లో పాల్గొంటున్నానని అన్నాడు. టెన్నిస్ సర్క్యూట్‌లో నిలకడగా ఆడుతూ టాప్-100లో చేరాలంటే ఏడాదికి కనీసం రూ. 1 కోటి ఖర్చు అవుతుందని నగాల్ చెప్పాడు. 'కొన్నేళ్లుగా నిలకడగా ఆడుతూ భారత నంబర్‌వన్‌గా ఉన్నా నాకు కనీస మద్దతు కరువైంది. ప్రభుత్వం 'టాప్స్' పథకంలో నా పేరు చేర్చలేదు. డబ్బులు లేక జర్మనీలోనే టెన్నిస్ అకాడమీలో శిక్షణకు దూరమయ్యాను. నేను గాయపడి ఆటకు దూరమైనపుడు అసలు ఎవరూ నన్ను పట్టించుకోలేదు. రెండుసార్లు కోవిడ్ రావడంతో ర్యాంక్ పడిపోయింది. మన దేశంలో ఆర్థికంగా మద్దతు లభించడం చాలా కష్టం. నా వద్ద ఉన్న డబ్బంతా ఆటకే పెడుతున్నా. గత రెండేళ్లలో ఏమీ సంపాదించలేదు. నేనేమీ ఫైవ్ స్టార్ హోటల్స్‌లో ఉండటం లేదు. అన్నీ కనీస అవసరాలే. ఏం చేయాలో అర్థం కావడం లేదు. పూర్తిగా చేతులెత్తేశాను' అని నగాల్ తన బాధను చెప్పుకున్నాడు.

పతకానికి విజయం దూరంలో...

- సెమీస్‌లో పోరాడి ఓడిన అంతిమ్
- నేడు కాంస్య పతక బౌట్‌లో గెలిస్తే పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత
- తొలి రౌండ్‌లో ప్రపంచ చాంపియన్‌పై నెగ్గిన భారత రెజ్లర్



అంతిమ్ పంఘాల్

బెల్‌గ్రేడ్ (సెర్బియా): భారత రెజ్లింగ్ రైజింగ్ స్టార్ అంతిమ్ పంఘాల్ సీనియర్ స్థాయిలోనూ సత్తా చాటుకుంది. అండర్-20 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో వరుసగా రెండేళ్లు స్వర్ణ పతకాలు నెగ్గిన తొలి భారతీయ రెజ్లర్‌గా చరిత్ర సృష్టించిన అంతిమ్... ప్రస్తుతం ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతక రేసులో నిలిచింది. సెమీఫైనల్లో అంతిమ్ 4-5 పాయింట్ల తేడాతో వనెసా కలాద్‌జిన్‌స్కాయా (బెలారస్) చేతిలో పోరాడి ఓడిపోయింది. నేడు జరిగే కాంస్య పతక బౌట్‌లో అంతిమ్ గెలిస్తే పతకంతోపాటు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ కూడా ఖరారవుతుంది. సోటెల్‌విరా ఒర్‌షుష్ (హంగేరి), ఎమ్మా జోనా డెనిస్ మాల్మ్‌గ్రెన్ (స్వీడన్) మధ్య బౌట్ విజేతతో కాంస్య పతకం పోరులో అంతిమ్ తలపడుతుంది. అంతకుముందు తొలి రౌండ్‌లో అంతిమ్ 3-2తో డిఫెండింగ్ చాంపియన్ డొమినిక్ ఒలివియా పారిష్ (అమెరికా)ను బోల్తా కొట్టించింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో అంతిమ్ 10-0తో రొక్సానా మార్టా జసినా (పోలాండ్)పై, క్వార్టర్ ఫైనల్లో 9-6తో నటాలియా మలిషెవా (రష్యా)పై గెలుపొందింది. భారత్‌కే చెందిన మనీషా (62 కేజీలు), ప్రియాంక (68 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లో, జ్యోతి బెర్వాల్ (72 కేజీలు) తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. భారత రెజ్లింగ్ సమాఖ్యపై నిషేధం కొనసాగుతున్న నేపథ్యంలో భారత రెజ్లర్లు యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) పతాకంపై, ఉక్రెయిన్‌తో యుద్ధం నేపథ్యంలో రష్యా, బెలారస్ రెజ్లర్లు తటస్థ అథ్లెట్లుగా ఈ మెగా ఈవెంట్‌లో పోటీపడుతున్నారు.

సినిమా

మళ్లీ జోడీగా...



● సాయి పల్లవి, నాగచైతన్య

హీరో నాగచైతన్య, హీరోయిన్ సాయి పల్లవి మళ్లీ జోడీగా కనిపించనున్నారు. 'లవ్ స్టోరీ' (2021) వంటి సూపర్ హిట్ చిత్రం తర్వాత ఈ ఇద్దరూ 'ఎన్‌సీ 23'లో (వర్కింగ్ టైటిల్) మరోసారి స్క్రీన్ షేర్ చేసుకుంటున్నారు. చందు మొండేటి ఈ చిత్రానికి దర్శకుడు. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించనున్న ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఈ సినిమాలో సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు బుధవారం మేకర్స్ ప్రకటించారు. ''వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కనున్న చిత్రమిది. నాగచైతన్య, చందు మొండేటి కెరీర్‌లో భారీ బడ్జెట్ చిత్రం అవుతుంది. త్వరలోనే షూటింగ్ ప్రారంభిస్తాం'' అని యూనిట్ పేర్కొంది.

తెలుగోడి జానపదం దమ్ము చూపించింది

- నిర్మాత 'బన్నీ' వాసు



● విద్య, శ్రీకాంత్, శివానీ, రాహుల్, 'బన్నీ' వాసు

''ఒక పాట హిట్ అయితే సక్సెస్ మీట్ చేయడం మాకు తెలిసి ఇదే తొలిసారి. మా 'కోట బొమ్మాళి పీఎస్' సినిమాలోని 'లింగి లింగి లింగిడి...' పాట తెలుగోడి జానపదం దమ్ము చూపించింది. ఈ పాటకి పి. రఘు సాహిత్యం అందించడంతో పాటు పాడారు'' అని నిర్మాత 'బన్నీ' వాసు అన్నారు. రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్, శ్రీకాంత్ మేక, వరలక్ష్మీ శరత్‌కుమార్ నటిస్తున్న చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజ మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మిస్తున్నారు. రంజిన్ రాజ్, మిధున్ ముకుందన్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'లింగి లింగి లింగిడి...' అంటూ సాగే పాటను ఇటీవల విడుదల చేశారు. ఈ పాటకి అద్భుతమైన స్పందన వస్తోందంటూ సక్సెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ- ''చాలా కాలం తర్వాత మంచి సినిమా చేశాననే అనుభూతి ఉంది'' అన్నారు. ''నా జీవితంలో గుర్తుండిపోయే పాట వచ్చినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు రాహుల్ విజయ్. ''ఈ పాట ఎంత పాపులర్ అయ్యిందో సినిమా కూడా అలాగే ఉంటుంది'' అన్నారు శివానీ రాజశేఖర్. ''నా సినిమాలో జానపదం పాట పెట్టాలనే కల ఈ చిత్రంతో నెరవేరింది'' అన్నారు తేజ మార్ని.

హిట్ అయినదే పెద్ద సినిమా

- శ్రీకాంత్



● 'రుద్రం కోట' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఓ దృశ్యం

''రుద్రం కోట' చిత్రం ట్రైలర్, పాటలు బాగున్నాయి. ఇప్పుడు ఏది హిట్ అయితే అదే పెద్ద సినిమా అవుతోంది. ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించి, కొత్తవారిని ప్రోత్సహించాలి'' అన్నారు నటుడు శ్రీకాంత్. రుద్ర హీరోగా, శక్తి, విభీష హీరోయిన్లుగా రాము కోన దర్శకత్వం వహించిన చిత్రం 'రుద్రం కోట'. నటి జయలలిత కీలక పాత్రలో నటించి, సమర్పించారు. అనిల్ ఆర్కా కండవల్లి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న స్క్రీన్ మాక్స్ సంస్థ ద్వారా విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ని శ్రీకాంత్, నటి రాశీ విడుదల చేశారు. రాశీ మాట్లాడుతూ- ''రుద్రం కోట' టీజర్, ట్రైలర్ బాగున్నాయి. సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''మా సినిమాను సపోర్ట్ చేస్తున్నవారికి కృతజ్ఞతలు'' అన్నారు జయలలిత. ''ప్రేక్షకులు మా చిత్రాన్ని ఆదరించి పెద్ద సినిమాగా చేస్తారని ఆశిస్తున్నాను'' అన్నారు అనిల్ ఆర్కా.

నాగేశ్వరరావుగారు నట విశ్వవిద్యాలయం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



● విగ్రహావిష్కరణ చేస్తున్న వెంకయ్య నాయుడుతో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, అక్కినేని వెంకట్, నాగార్జున

''తెలుగు సినీ రంగానికి ఎన్టీఆర్, ఏయన్నార్ రెండు కళ్లు అని ఎప్పుడూ చెబుతుంటాను. తన జీవితాన్ని ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దుకోవడం నాగేశ్వరరావుగారిలోని గొప్పతనం. అమరశిల్పి జక్కన్న, విప్రనారాయణ, తెనాలి రామకృష్ణ, మహా కవి కాళిదాసు.. ఇలా ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఎలాంటి సినిమాలో అయినా ఒదిగిపోయేవారు. నాగేశ్వరరావుగారు ఒక పెద్ద నటనా విశ్వవిద్యాలయం. ఈ రోజు పరిశ్రమలోకి వచ్చిన ప్రతి ఒక్కరూ ఆ విశ్వ విద్యాలయంలో విద్యార్థిననుకుని, ఆ గుణగణాలను అందిపుచ్చుకుంటే భవిష్యత్‌కు మంచి ప్రణాళికలు వేసుకున్నట్లవుతుంది'' అన్నారు భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యానాయుడు. బుధవారం (సెప్టెంబరు 20) ప్రముఖ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అక్కినేని నాగేశ్వరరావు విగ్రహాన్ని వెంకయ్యానాయుడు ఆవిష్కరించి, మాట్లాడుతూ- ''నాగేశ్వరరావుగారు మహానటులు.. మహా మనిషి. సినిమా రంగంలో విలువలు పాటించిన వ్యక్తి నాగేశ్వరరావు గారు. అవతలివాళ్లు నేర్చుకోదగ్గ కొన్ని మంచి సంప్రదాయాలు, విలువల్లో ఆయన జీవించి, నటించి మనకు చూపించారు. ఆ మార్గంలో ప్రయాణిస్తే అదే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి. నాగేశ్వరరావుగారు పరిపూర్ణమైన జీవితాన్ని గడిపి, జీవిత చరమాంకంలోనూ నటిస్తూనే ఉన్నారు. కొంతమంది జీవిత కాలంలో జీవిస్తారు. జీవిత కాలం పూర్తయిన తర్వాత కూడా జీవించే మహానుభావులు కొందరు. వారిలో అక్కినేని నాగేశ్వరరావుగారు అగ్రగణ్యులు. ఆయన మంచి నటులే కాదు.. పరిణతి చెందిన గొప్ప ఆశావాది కూడా. ఆయన నాస్తికుడు. గొప్ప తాత్వికుడు. ఆయన పెద్దగా చదువుకోలేదని అంటారు. కానీ జీవితాలను చదివారు. జీవితంలో ఆయన పోరాటం చేశారు.. జీవితాన్ని ప్రేమించారు.. ఆస్వాదించారు. జీవితంలో నేర్చుకున్న దాన్ని ఆచరణలో పెట్టి చూపించారు'' అని అన్నారు.

యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ- ''1950 సమయంలో నాగేశ్వరరావుగారు సినిమాల్లో నటించడం ప్రారంభించాక, సొంతిల్లు కట్టుకోవడానికి ముందే మద్రాస్ విశ్వ విద్యాలయానికి పాతికవేల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆ తర్వాత ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పాతిక వేలు ఇచ్చారు. శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయానికి కూడా పాతిక వేలు విరాళం ఇచ్చారు. ఇవన్నీ ఒక ఎత్తైతే.. 1959లో లక్ష రూపాయల విరాళం ఇచ్చి గుడివాడ కళాశాలను నిలబెట్టారు. నాలాంటివారు ఎందరో చదువుకోగలిగారు. ఆ విధంగా ఆ ప్రాంతంలో సామాజిక, ఆర్థిక, రాజకీయంగా ఓ విప్లవానికి ఆయన నాంది పలికారు'' అన్నారు.

డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ - ''అక్కినేని నాగేశ్వరరావుగారి కష్టం, కళల పట్ల ఆయనకు ఉన్న ప్రేమ ఆయన్ను ఓ లెజెండ్‌ని చేశాయి. యువ నటీనటులకు నాగార్జునగారు స్ఫూర్తి అని నా ఫ్రెండ్స్ సర్కిల్స్‌లో చెబుతుంటారు. నాగార్జునగారేమో తన తండ్రి చూపించిన మార్గంలో నడిచానని చెబుతుంటారు'' అన్నారు.

నాగార్జున మాట్లాడుతూ- ''ఎవరి విగ్రహాన్ని అయినా చూస్తే.. ఆయన ఓ మహానుభావుడు... ఆయన మనతో లేరనే భావన నా మనసులో చిన్నతనం నుంచే ముద్రపడింది. ఏ విగ్రహం చూసినా నాకు అదే అనిపించేది. అందుకే వెంకయ్యానాయుడుగారు ఆవిష్కరించేంతవరకూ నేను నాన్నగారి విగ్రహాన్ని చూడలేదు. చూడబుద్ధి కాలేదు. ఎందుకంటే నాన్నగారు మాతో లేరనే విషయాన్ని అంగీకరించాల్సి వస్తుందేమోనని... శిల్పి వినీత్ ఈ విగ్రహాన్ని అద్భుతంగా చెక్కాడు. నాన్నగారు అద్భుతమైన జీవితాన్ని జీవించారు. తరతరాలుగా గుర్తుపెట్టుకునే పాత్రలు చేసిన నటుడు. కోట్లమంది తెలుగు ప్రజలు, అభిమానులు ప్రేమించిన వ్యక్తి.. ఇలా వివిధ రకాలుగా నాన్నగారు అందరికీ తెలుసు. మాకు మాత్రం నాన్నగారు మా గుండెలను ప్రేమతో నింపిన వ్యక్తి. నన్ను, నా తోబుట్టువులను, మా పిల్లలను.. అందర్నీ చల్లగా చూసిన వ్యక్తి. మాకు మనసు బాగున్నా, బాగోలేకున్నా నాన్నగారి దగ్గరికి వెళ్లి కూర్చుంటే చాలు అన్నీ సర్దుకునేవి. అన్నపూర్ణ స్టూడియోస్ నాన్నగారికి నచ్చిన స్థలం. నచ్చిన చోట విగ్రహం పెడితే ప్రాణ ప్రతిష్ఠ చేసినట్లు అంటారు. సో.. ఆయన ప్రాణంతో మా దగ్గరే ఉన్నారని, ప్రాణంతో మా మధ్యనే నడుస్తున్నారని అనుకుంటున్నాము. నా ఆలోచనల్లోనే కాదు.. ప్రతి ఒక్కరి ఆలోచనల్లో నాన్నగారు ఎప్పటికీ జీవించే ఉంటారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా వచ్చిన వారికి, ఎక్కడెక్కడి నుంచో ఇక్కడికి వచ్చిన నాన్నగారి అభిమానులకు ధన్యవాదాలు'' అన్నారు.



● అఖిల్ ● నాగచైతన్య

నాగచైతన్య మాట్లాడుతూ- ''ఏయన్నార్‌గారంటే తెలుగు చిత్ర పరిశ్రమలో ఓ పెద్ద, ఓ గొప్ప నటుడు. క్లాసిక్ ఐకాన్‌గా పరిచయం. ఆయన చిత్రాలు, ఆయన చేసిన ప్రయోగాలు ప్రేరణ కలిగించే కేస్ స్టడీగా చాలా మంది ఫిల్మ్ స్కూల్స్‌లో చదువుతుంటారు. ఈ జాబితాలో నేనూ ఉన్నాను. తాతగారితో నేను కలిసి నటించడం నా అదృష్టం. మన పుట్టుక మన చేతిలో ఉండదు. అలాంటిది అక్కినేని నాగేశ్వరరావుగారి మనవడిగా పుట్టడం నా అదృష్టం'' అని అన్నారు.

తాత ఏయన్నార్‌కు అఖిల్ నివాళులర్పించారు.

ఏయన్నార్ పెద్ద కుమారుడు వెంకట్ అక్కినేని మాట్లాడుతూ- ''మనిషి ఎంత కీర్తి సంపాదించినా, ఎంత ధనం గడించినా తలగడ మీద తల పెట్టగానే నిద్రపోవడం అనే ఆస్తి, సౌకర్యం ఏ ధనం ఇవ్వలేదు. ఏయన్నార్‌గారు తలగడ మీద తల పెట్టగానే హాయిగా నిద్రపోయేవారు. 1974లో బైపాస్ సర్జరీ జరిగింది. సర్జరీ ముందు రోజు నర్సు నిద్రకోసం మాత్ర ఇస్తే తీసుకోలేదు. ఏ మాత్ర వేసుకోకుండానే హాయిగా నిద్రపోయారు. ఆ తర్వాత ఆయన జీవితం అందరికీ తెలిసిందే. నాకు మరుజన్మ అంటూ ఉంటే ఆయన సన్నిధిలోనే ఉండాలనుకుంటున్నాను. అన్నపూర్ణ సంస్థ, ఏయన్నార్ ఫిల్మ్ స్కూల్, కాలేజీ, ఆయన చిత్రాలు, ఫ్యాన్స్ తీపి గుర్తులు'' అన్నారు.

మోహన్‌బాబు మాట్లాడుతూ- ''నాగేశ్వరరావు గారు ఒక గ్రంథం. ఆయన 'మరపురాని మనుషులు' సినిమాకు అసోసియేట్‌గా చేశాను. అన్నపూర్ణ సంస్థలో ఎన్నో సినిమాల్లో నటించాను'' అన్నారు.

బ్రహ్మానందం మాట్లాడుతూ- ''రైతు కుటుంబంలో పుట్టి అద్భుతమైన స్థితికి చేరుకున్న వ్యక్తి నాగేశ్వరరావుగారు. మహానట వృక్షం. కళాకారులకు గొప్ప వరం. స్వయంశిల్పి. స్నేహశీలి. అద్భుతమైన క్రమశిక్షణ కలిగిన వ్యక్తి'' అన్నారు.

ఎస్ఎస్ రాజమౌళి మాట్లాడుతూ- ''ఓ వేడుకలో నాగేశ్వరరావుగారితో మాట్లాడే అవకాశం లభించింది. స్టార్ అయిన మీరు 'మిస్సమ్మ' సినిమాలో కమెడియన్‌గా ఎందుకు చేశారు? అని ఆయన్ను అడిగాను. 'దేవదాసు' తర్వాత అన్నీ తాగుబోతు పాత్రలే వస్తున్నాయని, ఇమేజ్ మార్చుకోకపోతే ఇబ్బందవుతుందేమోనని, ఆ పాత్రను తానే అడిగి మరీ చేశానని చెప్పారు. నాగేశ్వరరావుగారికి ఆయనపై ఆయనకు ఉన్న నమ్మకానికి నమస్కారం చేయాలనిపించింది'' అన్నారు.



● రామ్‌చరణ్, నమ్రత, మహేశ్ బాబు

జయసుధ మాట్లాడుతూ- ''నాగేశ్వరరావుగారితో ఎక్కువ సినిమాలు చేయడం నా అదృష్టం. క్రమశిక్షణతో పాటు ఆయన దగ్గర ఎన్నో విషయాలు నేర్చుకున్నాను'' అన్నారు.

ఏయన్నార్ కుమార్తె నాగ సుశీల మాట్లాడుతూ- ''అందరికీ పండగలు ఉంటాయి. కానీ మా అక్కినేని అభిమానులకు నాన్నగారి జయంతే పండగ. అభిమానుల ప్రోత్సాహం వల్లే ఈ కార్యక్రమం సాధ్యమైంది. అమ్మానాన్నలు మేం ఎప్పుడూ కలిసే ఉండాలని కోరుకునేవారు. అలా మేమందరం కలిసే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని చేశాం'' అన్నారు.

సుశాంత్ మాట్లాడుతూ- ''తాతగారు తన జీవితంలో కృతజ్ఞతకు విలువ ఇచ్చేవారు. ఇండస్ట్రీలో తారాస్థాయికి ఎదిగిన ఆయనకు కళామతల్లికి తిరిగి ఇవ్వాలని ఉండేది. అన్నపూర్ణ స్టూడియోస్, అక్కినేని ఇంటర్నేషనల్ ఫౌండేషన్, ఏయన్నార్ నేషనల్ అవార్డు, అన్నపూర్ణ కాలేజ్ ఆఫ్ ఫిల్మ్ అండ్ మీడియా.. ఇలా ఎన్నో ఆయన కృతజ్ఞతలోంచి వచ్చిన ఆలోచనలే'' అన్నారు.

''నాగేశ్వరరావుగారి విగ్రహం పనులను నాకు అప్పగించిన అక్కినేని కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు. దాదాపు ఐదున్నర నెలలు వర్క్ చేశాం'' అన్నారు విగ్రహ రూపకర్త వినేష్ విజయన్.

ఈ కార్యక్రమంలో అమల, సుప్రియ, సుమంత్.. ఇలా అక్కినేని కుటుంబ సభ్యులతో పాటు మురళీ మోహన్, రాజేంద్రప్రసాద్, జగపతిబాబు, శ్రీకాంత్, మంచు విష్ణు, నాని, నాజర్, అనుపమ్ ఖేర్, అల్లు అరవింద్, అశ్వినీదత్, సి. కల్యాణ్, కేఎల్ నారాయణ, 'దిల్' రాజు, చినబాబు, నాగవంశీ, బి. గోపాల్, వైవీఎస్ చౌదరి, పి. కిరణ్, గుణ్ణం గంగరాజు, విజయ చాముండేశ్వరి తదితరులు పాల్గొని, అక్కినేని నాగేశ్వరరావుకి నివాళులు అర్పించారు.